



## రచనాచౌర్యం

అర్యా!

**1-7-58** వ తేదీ "చిత్రగుప్త"లో "జీవిత నైజాలు" అనే కథానికను, అర్. హెచ్. బాబు రచించినట్లు ప్రకటింపబడింది. కాని ఆ కథానిక నా స్వంత రచన. ఆ రచన "జ్యోతి" **1956** వ సంవత్సరము అగస్టునెల సంచికలోనిది సంగ్రహించి, మక్కికి మక్కీ కాపీచేసి పంపించినట్లు రుజువయింది.

ఒక పత్రికలో ప్రచురితమైన ఇతరుల రచనలను పంపించి, పత్రికల్లో తన పేరునుచూసి, మురిసిపోయేకన్నా' స్వయంకృషితో కథారచన సాగించి, పత్రికలయొక్క, పాఠకులయొక్క అభిమానాన్ని చూరగొనడం భావ్యం. అంతేకాని దొంగ రచనలతో కీర్తి నార్జిద్దామనే మరుద్దేశంతో ఇటు పత్రికలవారిని, అటు రచయితలను ద్రోహంచేయ తలపెట్టడం చాలా నీచం.

ఇటువంటి రచయితలకు బుద్ధి చెప్పాలని కోరుతాను.

తాళ్లపూడి వెంకటరమణ

## అతనికంటె ఘనుడు

జేబులు కత్తిరించడంలో మా అనందుది అందవేసిన చెయ్యి. చేబులు కత్తిరించడం కూడ ఒక కళేనంటాడు మా ఆనందు. ఎలాగయితేనేం అతని కళాకౌశలాన్ని తిలకించాలని ఒక నాటి సాయంకాలం అతనితోకూడ బయలుదేరాను. అతడు నన్ను సరాసరి చైనా బజారుకు తీసుకుపోయాడు. అలావెళ్తూ అతి చాకచక్యంగా ఒక మార్వాడీవద్ద నుండి చిటికలో పర్సు కొట్టేశాడు ఆనందు. ఇహనేం. ఇద్దరం కలసి మినర్వాకు బయలుదేరాము. "భవనాని జంక్షన్" చూడ్డానికి. థియేటరు చేరుకుని బుక్కింగ్ ఆఫీస్‌వద్దకువచ్చిరెండు టికెట్లు కొనడానికని డేబులో చెయ్యి వేశాడు మిత్రశ్రీ ఆనందు. అదేం చోద్యమోగాని అంతసేపూ కళకళలాడుతూండిన అతని మొగము ఆ క్షణములో మసిబొగ్గులా మాడిపోయింది. కారణం యేమిటో తెలుసా? మేము చైనాబజారు నుండి మినర్వాకు వచ్చేలోపుగా పేరుమోసిన జేబుదొంగ మా ఆనందు కాజేసిన పర్సును అతనికంటే ఘనుడెవడో కొట్టేశాడు.

జి. చిరంజీవి

## రామయ్యా పరాకు

మా ఊరిలో రామయ్యలు చాలమంది ఉన్నారుగాని మతిమరుపు రామయ్యా మాత్రం ఒక్కడే ఉన్నాడు. అతని గురించి తెలియనివారు మా ఊరిలో ఒక్కరు కూడా లేరు.

మతిమరుపు రామయ్యాకు ముచ్చటగా ముప్ఫైయోఏట పెండ్లి చేసుకోవాలనిపించింది. తరచుగా తన పెండ్లి గురించి చాల చాల ఆలోచించేవాడు. తన పెండ్లి అయ్యాక పిల్లలను ఎలా పెంచాలో మొదలైన విషయాలు ఆలోచించేవాడు.

ఒక రోజు మతిమరుపు రామయ్యా ఏదో పనిమీద పోష్టు ఆఫీసుకు బయలుదేరి వెళ్ళాడు. పోష్టు కార్డులు, స్టాంపులు అమ్మిన దగ్గర నిలుచొని జేబులోనుండి డబ్బులు తీస్తుండేసరికి ఎవరో అన్నారు "రామయ్యగారి భార్య చనిపోయింది" అని. అది వినేసరికి మతిమరుపు రామయ్యా తన భార్యే పోయిందనుకొని విచారముతో తొందరతొందరగా అచ్చుట నుండి ఇంటి వైపు బయలుదేరాడు. త్రోవలో అతని స్నేహితుడు కనిపించి 'ఎందుకంత తొందరగా వెడుతున్నావ్?' అని అడిగాడు.

"నా భార్య చనిపోయిందట. అందుకు తొందరగా ఇంటికి వెళ్లకపోతే ఎలా?అన్నాడు మతిమరుపురామయ్యా."

"అరే నీకింకా పెండ్లికాలేదు కదా ఎలా నీభార్య చనిపోయింది" అనేసరికి మతిమరుపు రామయ్యాకు అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఇంకా తనకి పెండ్లి కాలేదని.

శ్రీరామమూర్తి